సాక్షి
విశాఖపట్నం
సోమవారం ၊ 22 ၊ జూలై ၊ 2024



నేవీ సైకిల్ యాత్ర

ఐఎన్ఎస్ శాతవాహన గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా రుషికొండ వరకు నేవీ ఉద్యోగులు సైకిల్ యాత్ర నిర్వహించారు.



నగరంలో వర్షం

నగరంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సముద్రంలో అలలు ఎగసిపడ్డాయి. ఈదురుగాలులు వీచాయి.



తీరంలో సలోని

కొమ్మాది: మంగమారిపేటలో ఆదివారం నటి సలోని సందడి చేశారు. మట్కా చిత్రానికి సంబంధించి పలు సన్నివేశాలను మంగమారిపేట, భీమిలిలో చిత్రీకరించారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కనకమహాలక్ష్మి దేవస్థానం సారె



పట్టువస్త్రాలు, సారె అందజేస్తున్న ఏఈవో రాంబాబు తదితరులు

దాబాగార్డెన్స్: ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విశాఖలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నుంచి ఆదివారం సారె సమర్పించారు. దేవస్థానం ఏఈవో రాంబాబు, ఆలయ అర్చకులు, అధికారులను దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించి పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఈఓ రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి అమ్మవారి అర్చకుడు కె శ్రీనివాసశర్మ, వేద పండితులు సీహెచ్ఎల్ఎన్ అవధానులు, హనుమాన్ శర్మ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బాధ్యతలు స్వీకరిస్తా

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తానని ఐఏఎస్ అధికారి పి.సంపత్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనతో ఫోన్‌లో సంప్రదించగా.. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. జీవీఎంసీలో ప్రస్తుత పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తానన్నారు. విశాఖ అద్భుతమైన నగరమని, జీ20 సదస్సు జరిగిన సమయంలో ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు నగరంలో కొద్ది రోజులు ఉన్నానని వెల్లడించారు. నగర అభివృద్ధికి కృషి చేయడంతో పాటు.. ప్రజలకు అవసరమైన సమగ్ర సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తానని సంపత్‌కుమార్ తెలిపారు.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



దాబాగార్డెన్స్: జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సెంట్రల్ జైల్‌లో నేటి నుంచి జాతీయ స్థాయి సమావేశాలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో మూడు రోజులు పాటు జాతీయ స్థాయి సమావేశాలు జరగనున్నట్లు కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కొత్తగా రూపొందించిన చట్టాల గురించి సోమవారం నుంచి 24 వరకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు పాల్గొని కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో తీవ్ర నష్టం

అల్లిపురం: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రతినిధులు సీహెచ్ కాసుబాబు, డి.రమణ, షేక్ రెహమాన్ అన్నారు. ఆటో డ్రైవర్ల జీవన భృతికి గండి కొడుతున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో మోటార్ రంగ కార్మికులకు ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టాలని, జీవో 21ను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు.

నమో నారసింహా...

- ముగిసిన గిరి ప్రదక్షిణ
- జనసంద్రంగా మారిన సింహగిరి
- వర్షంలోనూ నడలని సంకల్పం
- భక్తులతో కిటకిటలాడిన పాతగోశాల
- విశేషంగా ఆలయ ప్రదక్షిణలు
- 9 లక్షల మంది గిరి ప్రదక్షిణ చేశారని అంచనా
- 60 వేల మందికి దర్శనం



వర్షంలో తడుస్తూ గిరి ప్రదక్షిణకు..



గిరి ప్రదక్షిణ చేసి తొలిపావంచా వద్దకు వెళ్తున్న భక్తులతో కిక్కిరిసిన అడవివరం ప్రధాన రహదారి

సింహాచలం: శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామిని స్మరిస్తూ శనివారం లక్షలాదిమంది భక్తులు చేపట్టిన సింహగిరి ప్రదక్షిణ ఆదివారంతో ముగిసింది. సింహాచలంలోని తొలిపావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల ప్రదక్షిణ చేసి తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. స్వామి సన్నిధిలో మళ్లీ కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ ముగించారు. పలువురు భక్తులు స్వామి దర్శనానికి మెట్లమార్గంలో సింహగిరికి తరలివెళ్లారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురుస్తున్నా భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు.

తెల్లవారుజామున 3.30గంటల నుంచే దర్శనాలు

గిరి ప్రదక్షిణ చేసి వచ్చిన భక్తులకు ఆదివారం తెల్లవారుజామున 3.30గంటల నుంచే స్వామివారి దర్శనాలు కల్పించారు. ముందుగా ఉదయం 5.30 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తామని దేవస్థానం అధికారులు ప్రకటించారు. కానీ భక్తుల సౌకర్యార్థం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే దర్శనాలు అందజేయడం విశేషం. సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేశారు. భక్తులకు త్వరితగతిన దర్శనాలు అందించేందుకు ఉచిత దర్శనం క్యూతో పాటు రూ100,రూ.300 దర్శన టికెట్ల క్యూల్లో కూడా భక్తులను ఉచితంగా పంపించారు. ఆలయ నీలాద్రి గుమ్మం దగ్గర నుంచే లఘు దర్శనం కల్పించారు. అంతరాలయ దర్శనం బంద్ చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపే దాదాపు భక్తుల దర్శనాలు పూర్తయ్యాయి.

విశేషంగా ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై ఆలయ ప్రదక్షిణలు ఘనంగా జరిగాయు. తెల్లవారుజామున 3గంటల నుంచి భక్తులను ఆలయ ప్రదక్షిణలకు అనుమతించారు. అప్పటికే సింహగిరికి చేరుకున్న భక్తులు ఆలయ బాహ్య ప్రాకారం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

సింహగిరిపై జన జాతర

శనివారం 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతోను, మరో పక్క ఆలయ ప్రదక్షిణలకు వచ్చిన భక్తులతోను ఆదివారం సింహగిరి జనజాతరగా మారింది. భక్తులతో కిటకిటలాడింది.

9 లక్షలు మంది గిరి ప్రదక్షిణ

శనివారం 32 కిలోమీటర్ల మేర 9 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేసినట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే ఆదివారం 60 వేల మంది స్వామివారి దర్శనానికి వచ్చినట్టు, సుమారు 5వేల మంది ఆలయ ప్రదక్షిణల్లో పాల్గొన్నట్టు అంచనా వేశారు.

- కొండదిగువ పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం వరకు ఉన్న మార్గం భక్తులతో కిక్కిరిసింది. ఒక పక్క గిరి ప్రదక్షిణ పూర్తిచేసి తొలిపావంచాకు చేరుకునే భక్తులతోను, మరోపక్క గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకుని ఇళ్లకు చేరుకునే భక్తులతోను రద్దీ నెలకుంది.
- గిరి ప్రదక్షి ముగించుకుని తిరిగి కొబ్బరికాయలు కొట్టే భక్తులతో తొలిపాంచా కిటకిటలాడింది.
- మెట్లమార్గంలో కేవలం సింహగిరికి వెళ్లే భక్తులనే అనుమతించారు. కొండదిగువకి మెట్లమార్గంలో అనుమతించలేదు.
- కొండదిగువకి భక్తులను చేరవేసేందుకు దేవస్థానం 45 ఉచిత బస్సులను ఏర్పాటు చేసింది.
- 32 కిలోమీటర్లు చేసి గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి సింహగిరికి వచ్చిన భక్తులను ఆలయ ఉత్తరరాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి ఆలయంలోకి, దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తులను దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి పంపించారు.
- ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద నాలుగు లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.



క్యూ లైన్‌లో భక్తులు

- సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయం వద్ద, సింహగిరి బస్టాండ్‌లోను అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు.
- సింహగిరిపైన, కొండదిగువ పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు.
- ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నాలుగు లైన్లలో భక్తులు వెళ్లి దర్శనం చేసుకునేలా ర్యాంపులు ఏర్పాటు చేశారు.
- భక్తులు కొట్టిన కొబ్బరికాయలతో తొలిపావంచా వద్ద పెద్ద ఎత్తున కుప్ప ఏర్పడింది. ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్ తరలించేలా చర్యలు చేపట్టారు.
- సింహగిరిపై అన్నప్రసాద భవనంలో నిర్విరామంగా దద్దోజనం, పొంగళి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.
- కొండదిగువ పాతగోశాల జంక్షన్ వద్ద తీవ్ర రద్దీ నెలకుంది. ప్రదక్షిణ ముగించుకున్న భక్తులంతా పాతగోశాల దంక్షన్‌లో ఆర్టీసి బస్సులు ఎక్కారు. ఆర్టీసీ బస్సులన్నీ భక్తులతో రద్దీగా మారాయి.
- తొలిపావంచా వద్ద భక్తులకోసం ఏర్పాటు చేసిన స్టాల్,క్యూలపై వేసిన షామియానాలు వర్షానికి కూలిపోయాయి.



ఈదురుగాలులకు కూలిపోయిన టెంట్లు



ఆలయ ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



ప్రదక్షిణ పూర్తి చేసి తర్వాత తొలిపావంచా వద్ద మొక్కుకుంటున్న భక్తులు

మా పరిస్థితి ఏంటీ?

- ఎంపీ భరత్‌ను నిలదీసిన పలు వార్డుల టీడీపీ అధ్యక్షులు
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చేరితే మేం ఒప్పుకోమని తెగేసి చెప్పిన గాజువాక నేతలు

మహారాణిపేట: "ఎంపీ సార్.. మీరు కండువా కప్పేశారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. పార్టీని వార్డుల్లో నిలబెట్టేందుకు ఎన్నో అష్టకష్టాలు పడ్డాం. ఇప్పుడు మళ్లీ ఆ కార్పొరేటర్లే వార్డులో పెత్తనం చెలాయిస్తారు. అధికారంలో ఉన్నా.. మా పరిస్థితి అగమ్య గోచరమేనా. మా భవిష్యత్తు ఆలోచించరా.?" అంటూ టీడీపీ కార్యాలయంలో ఎంపీ భరత్‌ను వివిధ వార్డులకు చెందిన టీడీపీ కార్పొరేటర్లు నిలదీశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశం ఉత్కంఠగా సాగింది. పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు,ఎంపీ సమక్షంలో పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం ఆవరణలో కొంత మంది తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు నిరసన గళం విప్పారు. తమ అభిప్రాయాలు కనీసం తెలుసుకోకుండా.. కార్పొరేటర్లకు కండువా కప్పడంపై ఆయా వార్డులకు చెందిన అధ్యక్షులు, సీనియర్ లీడర్లు అసహనం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లే తమ వార్డుల్లో పెత్తనం సాగించారని, ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉన్నా.. వాళ్లే ముందు వరసలో ఉండేందుకే పార్టీలో చేరారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తమ వ్యవహారాలు చక్కపెట్టుకోడానికే తప్ప.. పార్టీ మీద గౌరవంతో రాలేదని వ్యాఖ్యానించారు. ఎప్పటినుంచో పార్టీని నమ్ముకొని ఉన్నాం. ఇప్పుడు ఆ పార్టీ నుంచి వచ్చిన వారిని చేర్చుకుంటే వాళ్లు ఇప్పుడు కూడా మాపై పెత్తనం చేస్తారని.. ఇప్పుడు మేమేం చెయ్యాలంటూ 30వ వార్డుకు చెందిన టీడీపీ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ పోలిపల్లి జ్యోతి ఎంపీ భరత్‌ను నిలదీశారు. వాళ్లంతా శత్రువులు వారిని ఎలా చేర్చుకుంటారని వివిధ వార్డులకు చెందిన మహిళా కార్యకర్తలు భరత్‌ను చుట్టుముట్టి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీ భరత్ వారిని వారించి శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఎవ్వరికీ అన్యాయం చెయ్యమని వెళ్లిపోడానికి ప్రయత్నించిన ఎంపీ భరత్‌కు కార్యాలయం ఆవరణలోనూ అడ్డుకునేందుకు టీడీపీ నేతలు యత్నించారు.



ఎంపీ భరత్‌ను నిలదీస్తున్న టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ పోలిపల్లి జ్యోతి, మహిళా నేతలు

వ్యక్తిగత కారణాలతోనే..

సీతమ్మధార: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు తెలుగుదేశంలో చేరడంపై ఉత్తర నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కేకేరాజు స్పందించారు. వైఎస్సార్‌సీపీ టికెట్లు ఇచ్చి గెలిపించిందని, గెలిచిన కొందరు వ్యక్తిగత కారణాలతో పార్టీ వీడారన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు.

గాజువాకలోనూ లుకలుకలు..!

మరోవైపు గాజువాక నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు సైతం జిల్లా పార్టీ పెద్దల వ్యవహారంపై గుర్రుగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, ఇల్లపు లక్ష్మి, రాజన రామారావు టీడీపీలోకి చేరడంతో నియోజకవర్గంలో రచ్చ మొదలైంది. వారిని ఎలా చేర్చుకుంటారంటూ ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును నిలదియ్యాలని నిర్ణయించుకున్నారు. ఆయన వస్తే గాజువాక పార్టీ కార్యాలయంలో పంచాయితీ పెడతామని నియోజకవర్గంలోని నేతలు తీర్మానించుకున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నుంచి కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నారన్న సమాచారం రావడంతో వారిని చేర్చుకోవద్దంటూ కొందరు టీడీపీ వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి లేఖలు రాశారు. అయితే కార్పొరేటర్ల రాకతో అసంతృప్తితో ఉన్న టీడీపీ వార్డు స్థాయి నేతలను బుజ్జగించే పనిలో ఎమ్మెల్యేలున్నారు. ఇదిలా ఉండగా టీడీపీలో చేర్చుకోమని చెప్పిన వారంతా జనసేనలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

టీడీపీలో చేరిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్లో పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆదివారం టీడీపీ పంచన చేరారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్‌తో పాటు కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, సారిపల్లి గోవింద్, బొడ్డు నరసింహప్రసాద్, ఇల్లపు వరలక్ష్మి, లొడగల అప్పారావు, రాజాన రామారావు చేరారు. వీరంతా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరారు.



ఘనంగా గురుపౌర్ణమి

గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. వ్యాసభగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏడాది గురుపౌర్ణమిని జరుపుకుంటారు. గురుపౌర్ణమి సందర్భంగా చినవాల్తేరులోని ఈస్ట్ షిర్డీ ఆలయంలో ప్రత్యేక అలంకరణతో సాయిబాబాకు పూజలు నిర్వహించారు. వందలాది పండ్లు, ప్రసాదాలను నివేదన చేశారు.

వైఎస్సార్ సీపీని వీడేది లేదు

- తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- అవకాశవాదులే పార్టీలు మారుతారు
- కార్పొరేటర్లు పద్మావతి, మేరీజోన్స్, జానకీరామ్

డాబాగార్డెన్స్: తల్లి వంటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు. రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తల్లిలా చూసుకుంటామని ఆ పార్టీకి చెందిన 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ 'సాక్షి'కి తెలిపారు. తాము కూడా తెలుగుదేశం, జనసేన పార్టీలో చేరుతున్నట్టు సోషల్ మీడియా జరిగిన ప్రచారాన్ని వీరంతా ఖండించారు. తామంతా వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నామని, పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజకీయ భిక్ష పెట్టిన జగన్‌మోహన్‌రెడ్డితోనే మా ప్రయాణమని, ఆయన నాయకత్వంలోనే తామంతా పనిచేస్తామని తేల్చి చెప్పారు. అవకాశవాదులే పార్టీ మారారని, తమకు ఆ అవసరం లేదన్నారు.

పార్టీ తల్లితో సమానం



పార్టీ తల్లితో సమానం. మా ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్సార్ సీపీలోనే ఉంటాం. అవసరమైతే రాజకీయాలు వదులుకుంటాం. పార్టీ మారే ప్రసక్తే లేదు. మా ఊపిరి ఉన్నంత వరకు జగనన్నతోనే ఉంటాం ..ఆయనతోనే ప్రయాణిస్తాం.

–మాసిపోగు మేరీజోన్స్, 36వ వార్డు కార్పొరేటర్

జగన్ వెంటే..



తెలుగుదేశం పార్టీలో చేరినట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందడం వల్ల చాలా బాధపడ్డాం..అయినా జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నాం. తాను ఏ పార్టీలో చేరేది లేదు. వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతా. కొంతమంది తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాంటి ప్రకటనలు నమ్మవద్దు.

–తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

జగనే మా నాయకుడు



తాను పార్టీ మారుతున్నానని, తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానని తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటు. తాను ఏ పార్టీలో చేరడం లేదు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే పని చేయడానికి సిద్ధంగా ఉన్నా. తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా.

–చెన్నా జానకీరామ్, 37వ వార్డు కార్పొరేటర్

వర్షాల కారణంగా 140 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

- త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: వర్షాలు, వరదల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాల్లో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని వివరించారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 140 గ్రామాల్లో 47,999 సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడటంతో పాటు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయనీ, విద్యుత్ తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, వీటన్నింటినీ సరి చేస్తున్నట్లు వివరించారు.



దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

వర్షం తగ్గిన ప్రాంతాల్లో మిగిలిన వాటిని సోమవారం నాటికి ప్రత్యేక బృందాలతో పూర్తి స్థాయిలో పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఈలకు ఆదేశాలిచ్చామని సీఎండీ వివరించారు. ఏ సమస్య తలెత్తినా వినియోగదారులు కార్పొరేట్ ఆఫీసు 9440816373, విశాఖపట్నం 7382299975 సెల్ నంబర్‌కు తెలియజేయాలని వినియోగదారులకు సీఎండీ విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

'డార్లింగ్' కచ్చితంగా మెప్పిస్తుంది

హీరో ప్రియదర్శి



సందడి చేస్తున్న డార్లింగ్ యూనిట్

దాబాగార్డెన్స్: డార్లింగ్ (వై దిస్ కొలవెరి) అన్ని వర్గాలూ చూడదగ్గ సినిమా అని హీరో ప్రియదర్శి, హీరోయిన్ నభానటేష్ పేర్కొన్నారు. చిత్రం ప్రమోషన్లో భాగంగా శనివారం నగరంలోని ఓ హోటల్లో చిత్రయూనిట్ సందడి చేసింది. అనంతరం హీరో ప్రియదర్శి మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 19న సినిమా విడుదల కానుందని, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మించారన్నారు. వివేక్ సాగర్ మంచి సంగీతం అందించారని, ఆయనకు ఇది 25వ చిత్రమన్నారు. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో పూర్తి హాస్యభరితంగా తెరకెక్కిన డార్లింగ్ చిత్రం ప్రేక్షకులను మెప్పిస్తుందన్నారు. ఈ చిత్రంలో ఏడు పాటలున్నాయని, బలగం, ఓం భీమ్‌బుష్ తర్వాత ఈ సినిమాతో హ్యాట్రిక్ కొడతానన్న ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ నభానటేష్ మాట్లాడుతూ విశాఖ బీచ్ అంటే చాలా ఇష్టమన్నారు. డార్లింగ్ చిత్రం ఫన్ ఎంటర్‌టైనర్ అని, భావోద్వేగాలుంటాయన్నారు. ఇస్మార్ట్ శంకర్ తరహా పాత్ర మళ్లీ ఎప్పుడు వస్తుందో చూడాలన్నారు. నటుడు విష్ణు మాట్లాడుతూ ఈ సినిమా ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనరని చెప్పారు. నటుడు తేజ మాట్లాడుతూ భార్య చేతిలో భర్త ఇబ్బంది పడితే పక్కనే ఉన్న తాము కూడా ఆనందించే పాత్రల్లో కనిపిస్తామన్నారు. ఈ సినిమాకు దర్శకుడు అశ్విన్‌రామ్.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 17 వరకు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. శిక్షణ కోసం ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆసక్తి గల గృహిణులు ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999కు సంప్రదించాలని కోరారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

బీచ్‌రోడ్డు: మద్యం మత్తులో ఓ వ్యక్తి విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెదవాల్తేర్ జంక్షన్‌లో కానిస్టేబుల్ ఎస్.అప్పారావు శుక్రవారం అర్ధరాత్రి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న భార్గవ్‌రెడ్డి రోడ్డు మధ్యలో నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో అతన్ని రోడ్డు పక్కన నడవాలని కానిస్టేబుల్ సూచించాడు. దీంతో ఆగ్రహించిన భార్గవ్ కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగాడు. స్థానికులు అతన్ని అడ్డుకున్నప్పటికీ.. దుర్భాషలాడుతూదాడి చేశాడు. ఈ దాడిలో అప్పారావు చేతికి గాయం కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వివాహితులు మృతి చెందారు. ఇందులో భర్తల కళ్ల ముందే ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధి పంతులు గారి మేడ వద్ద ట్యాంకర్ ఢీకొని ఇద్దరు, అగనంపూడి ఆస్పత్రి ఎదురుగా టిప్పర్ ఢీకొని ఓ వివాహిత చనిపోయారు. ఈ ఘటనలతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

అక్కిరెడ్డిపాలెం: నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలిగొలింది. స్కూటీపై నలుగురు ప్రయాణిస్తుండగా ట్యాంకర్ ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. తల్లీకుమార్తెలు ట్యాంకర్ చక్రాల కిందకు వెళ్లిపోవడంతో దుర్మరణం చెందారు. తాత, మనువడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. అగనంపూడి దిబ్బపాలెం కాలనీకి చెందిన జాజుల పార్వతి(51), ఆమె భర్త సూరిబాబు, కుమార్తె జాజుల సత్యవతి(26), సత్యవతి కుమారుడు పార్థు షీలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనులు చూసుకుని స్కూటీపై పాత గాజువాక మీదుగా అగనంపూడి వెళ్తున్నారు. సరిగ్గా పంతులు గారి మేడ వద్దకు వచ్చే సరికి స్కూటీని వెనుకనే వస్తున్న ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పార్వతి, సత్యవతి కుడివైపు తూలి ట్యాంకర్ చక్రాల కిందకు వెళ్లి పోవడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సూరిబాబు, పార్థు ఎడమ వైపు పడి.. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని.. స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.





తల్లీకూతుళ్లు పార్వతి(ఫైల్), సత్యవతి(ఫైల్)

టిప్పర్ ఢీకొని గృహిణి దుర్మరణం



రేవతి మృతదేహం

అగనంపూడి: టిప్పర్ రూపంలో గృహిణిని మృత్యువు కబలించింది. కొద్ది క్షణాల్లో కన్నవారింటికి చేరుకోవాల్సిన ఆమె దుర్మరణం పాలైంది. జాతీయ రహదారిపై అగనంపూడి ఆస్పత్రి ఎదురుగా జరిగిన దుర్ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివీ.. చోడవరం మండలం గోవాడకు చెందిన సరకాన సతీష్ ఫార్మా కంపెనీలో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సతీష్ తన భార్య రేవతి(27), కుమారుడు మూడేళ్ల భవ్యేష్‌తో కలిసి శనివారం ఉదయం మిందిలోని తన అత్తవారింటికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అగనంపూడి ఆస్పత్రి గేటుకు ఎదురుగా సతీష్ వాహనాన్ని వెనుకనే వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ క్రమంలో రేవతిని టిప్పర్ కొద్ది దూరం లాక్కొని వెళ్లిపోయింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనలో ఆమె భర్త, కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.



విచార వదనంతో రేవతి భర్త సతీష్

చోరీ కేసులో అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- మరో ముగ్గురు కూడా..
- 235 గ్రాముల బంగారం, 1,935 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం

అల్లిపురం: చోరీ కేసులో అంతర్ రాష్ట్ర నిందితుడితో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు నగర క్రైం డీసీపీ వెంకటరత్నం తెలిపారు. వారి వద్ద నుంచి 235 గ్రాముల బంగారం, 1,935 గ్రాముల వెండి ఆభరణాలు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ఆమె వెల్లడించారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధి ప్రహ్లాదపురానికి చెందిన ప్రొఫెసర్ పి.వి.ఎల్.ఎన్.శివప్రసాద్ ఒంగోలులోని ఓ కళాశాలలో పనిచేస్తున్నారు. అతని కుటుంబం ప్రహ్లాదపురంలోనే ఉంటుంది. ఈ ఏడాది మే 25న ఆయన కుటుంబంతో తీర్థయాత్రకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో దొంగతనం జరిగింది. 403 గ్రాముల బంగారం, 2,620 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం ఏసీపీ సీహెచ్ శ్యామలరావు పర్యవేక్షణలో వెస్ట్ క్రైం సీఐ ఎన్.శ్రీనివాసరావు, పెందుర్తి క్రైం ఎస్ఐ రామకృష్ణ ఈ కేసు దర్యాప్తు చేపట్టి.. తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లా భువనగిరిలో నివసిస్తున్న అంతర్ రాష్ట్ర దొంగ గజ్జెల శ్రీనివాసరెడ్డి ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. అతనితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు.

నిందితుడిపై 55 కేసులు

నిందితుడు శ్రీనివాసరెడ్డి కొన్ని కేసుల్లో 13 నెలలు విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించాడు. అతనిపై ఇప్పటి వరకు 55 కేసులు నమోదయ్యాయి. విశాఖలో శ్రీనివాసరెడ్డిపై ఏడు కేసులు నమోదై ఉన్నాయి. వీటిలో ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఒకటి, పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు కేసులున్నాయి. సిద్ధిపేట పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ కూడా ఉంది. నిందితుడు తన 8 ఏళ్ల వయసులోనే స్వగ్రామం గుంటూరు వదిలి సికింద్రాబాద్ వెళ్లిపోయాడు. 19వ ఏటా దొంగతనానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి దొంగతనాలకు అలవాటు పడ్డాడు. 2003లో తన భార్యతో కలసి విశాఖ వచ్చి.. మింది దగ్గర రాజీవ్‌నగర్‌లోని ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. ఆ సమయంలో తన ఇంటి సమీపంలో దేవి అనే మహిళతో పరిచయం పెంచుకున్నాడు. 2022లో ఓ బైక్‌ను చోరీ చేశాడు. 2023లో జైలు జీవితం అనుభవిస్తున్న సమయంలో ముద్దాయి నాగ మల్లేష్‌తో పరిచయం జరిగింది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సాయి కిరణ్(గంజాయి ముద్దాయి) పరిచయమయ్యాడు. అతని అన్నయ్య రాజారావును కూడా తనతో చేర్చుకున్నాడు. వీరు శ్రీనివాసరెడ్డి దొంగతనం చేసి తీసుకువచ్చిన వస్తువులను అమ్మేందుకు సహాయం చేసేవారు. శ్రీనివాసరెడ్డి తాను దొంగిలించిన సొత్తును దేవి వద్ద ఉంచేవాడు. ఆమె వద్ద నుంచి పోలీసులు చోరీ సొత్తును రికవరీ చేశారు. సాయికిరణ్, రాజారావు, దేవిలను అరెస్ట్ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

చరిత్రను వివరించడంలో రచయితలది కీలకపాత్ర

- మిజోరం గవర్నర్ హరిబాబు
- నల్ల టోపీ–నీలి కళ్లు–తెల్లతోలు పుస్తకావిష్కరణ

బీచ్‌రోడ్డు: చరిత్రను వెలికితీసి వివరించడంలో రచయితల పాత్ర కీలకమని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. శనివారం ఏయూ హిందీ భవనంలో లోక్‌నాయక్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన నల్ల టోపీ–నీలి కళ్లు–తెల్ల తోలు పుస్తకావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. నాటి యుగానికి నేటి యుగానికి మురళీమోహన్‌కృష్ణ పుస్తకం సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. ఈ పుస్తకం చదివితే చరిత్రకు సంబంధించి మన విజ్ఞానం పెరుగుతుందన్నారు. 1980 తర్వాత డాక్టర్ కోర్సు చదివిన వారంతా విదేశాల్లో పనిచేయడం ప్రారంభించారని, ఆ స్థానంలో ఇప్పుడు ఇంజనీరింగ్ చదివిన వారి సంఖ్య పెరిగిందన్నారు. విదేశాల్లోని అభివృద్ధి చూసినప్పుడు, మన దేశం కూడా అలాగే అభివృద్ధి చెందాలని ఆకాంక్షించాలన్నారు. అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు నిర్మాణమే కాదని చెట్లు పెంచడం కూడా అభివృద్ధి అన్నారు. కానీ భారతదేశంలో చెట్లు నరికేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు నాటడం ఒక ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక అభివృద్ధికి ప్రధాన ఆటంకం విదేశాల నుంచి దిగుమతి అని అభిప్రాయపడ్డారు. దిగుమతులను తగ్గించుకొని మనమే వస్తువులను తయారు చేసుకోవడం ద్వారా అభివృద్ధి సాధించగలమన్నారు. విదేశాలకే పరిమితమైన షేర్ మార్కెట్ బిజినెస్ నేడు దేశంలో కూడా విస్తరిస్తుందని వాటిలో మహిళలు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో లోక్‌నాయక్ ఫౌండేషన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు, మాజీ ప్రొఫెసర్ చందు సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిజోరం గవర్నర్ హరిబాబు

100 కిలోల గంజాయి స్వాధీనం?

ఎంవీపీకాలనీ: ఇద్దరు వ్యక్తులు ఆటోలో 100 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అయితే ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు పూర్తి వివరాలను గోప్యంగా ఉంచారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక మద్దిలపాలెం ట్రిబుల్ ఎస్ బార్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఓ ఆటోని నైట్ రౌండ్స్ పోలీసులు గుర్తించారు. అనుమానంతో ఆ ఆటోను తనిఖీ చేయగా ఐదు సూట్ కేసులతో పాటు నాలుగు బ్యాగుల్లో గంజాయి ఉండటం చూసి వారు అవాక్కయ్యారు. వెంటనే అప్రమత్తమై ఆటోతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు నుంచి విశాఖ మీదుగా అమ్మకాల కోసం ఈ గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఈ గంజాయి దాదాపు 100 కిలోలు ఉంటుందని సమాచారం. గంజాయి రవాణాకు సంబంధించి పెదబయలుకు చెందిన తలారి మోహనరావు, కొర్ర అశోక్‌కుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని ఎంవీపీ పోలీసులు నిర్ధారించ లేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా లోతుగా దర్యాప్తు చేసేందుకే వివరాలు గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

జర్నలిస్టుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

తాటిచెట్లపాలెం: రాష్ట్రంలో సుదీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం టీఎస్ఎన్ కాలనీలో గల హోటల్ సింకా గ్రాండ్‌లో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జిల్లా యూనిట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అర్బన్ అధ్యక్షుడు పి.నారాయణ్, రూరల్ అధ్యక్షుడు వెంకటేష్, ఈశ్వర్రావు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో అతిథులు

జిల్లా నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.నారాయణ్, కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా పి.వేణుగోపాల్‌తో పాటు కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.

హార్బర్ ఆధునికీకరణ వేగవంతం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం

మహారాణిపేట: విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం పరిశీలించారు. మోడ్రన్ ఫిషింగ్ హార్బర్, ఆధునిక వసతులతో కూడిన విక్రయ కేంద్రాలు, తాగునీటి, మురుగునీటి కాలువలు, చేపల వేలం కేంద్రాలు, విక్రయ హాళ్లు, కోల్డ్ స్టోరేజీలను పరిశీలించి.. అక్కడి పరిస్థితులను గమనించారు. హార్బర్‌లో జరుగుతున్న పనుల తాజా పరిస్థితిని విశాఖ పోర్ట్ అథారిటీ చీఫ్ ఇంజినీర్ వికాస్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు వివిధ అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. త్వరితగతిన ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మోడ్రన్ ఫిష్ మార్కెట్‌లో మంచినీటి సదుపాయం కల్పించాలని, 11వ నంబర్ జెట్టీ వరకు తాగునీటి వసతి కల్పించాలని విశాఖ పోర్టు, జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. వాడకం నీరు బయటకు పోయేందుకు నిర్మించిన మురుగునీటి కాలువను సక్రమంగా నిర్వహించాలన్నారు. పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చేపల వేలం కేంద్రం షెడ్డు పనులు వేగవంతం చేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. హార్బర్‌లోనే బోటులు మరమ్మతులు చేసుకోవడానికి సరైన సదుపాయాలు లేవని, డ్రై డాక్‌లో ఉన్నటువంటి ట్రాలీలను రిపేర్ చేయించాలని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డాల్ఫిన్ బోటు అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీర్రాజు, కార్యదర్శి వలిశెట్టి చిన్న, నాయకుడు సూరాడ సత్తిబాబు, గుంటు దానయ్య, మత్స్యశాఖ జేడీ విజయకృష్ణ, జీవీఎంసీ వాటర్ సప్లై ఈఈ రవి, విశాఖ పోర్టు అథారిటీ ఈఈ అరుణ్ కుమార్, జేఈ విశ్వనాథ్, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మత్స్యకారుల పంట పండింది



టేకు చేపతో మత్స్యకారులు



మహారాణిపేట: మత్స్యకారుల వలలకు నిండా చేపలు చిక్కాయి. కొమ్ముకోణం, టేకు, సొర చేపలు పుష్కలంగా లభించాయి. ఇందులో దాదాపు 120 కిలోలు ఉండే కొమ్ముకోణం దొరకడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. 20 నుంచి 60 కిలోల బరువు ఉండే ఈ కొమ్ముకోణం చేపలు కూడా లభ్యమయ్యాయి. శనివారం భారీగా చేరిన చేపలతో ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకొంది. కాగా.. కొమ్ముకోణం చేపలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఈ చేపలను కేరళవాసులు ప్రీతిగా స్వీకరిస్తారు. దీంతో చేపలను వ్యాన్, కంటైనర్లలో కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేశారు.

